క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మొగల్తూరు: మొగల్తూరు సబ్‌స్టేషన్ పరిధిలోని మొగల్తూరు, రామన్నపాలెం గ్రామాలకు సోమవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలు వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ డీఈ సురేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సబ్‌స్టేషన్ పరిధిలో అదనపు 11 కేవీ లైన్ ఏర్పాటు చేయు నిమిత్తం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగ దారులు సహకరించాలని ఆయన కోరారు.

పాలకొల్లు-మచిలీపట్నం సర్వీసులకు స్పందన

నరసాపురం: పాలకొల్లు-మచిలీపట్నం మధ్య గత ఏడాది నుంచి తిప్పుతున్న బస్సు సర్వీస్‌లకు ప్రయాణికుల నుంచి మంచి స్పందన లభిస్తోందని నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఆర్ సుబ్బన్నరెడ్డి చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సర్వీస్‌లు ఉదయం 5.30 గంటలు నుంచి సాయంత్రం 6.30 గంటలు వరకూ ప్రతి 45 నియిషాలకు ఒక బస్సు తిరిగేలా చర్యలు చేపట్టామని చెప్పారు. పాలకొల్లు, నరసాపురం, మొగల్తూరు మీదుగా ఈ సర్వీస్‌లు నడుస్తున్నాయని చెప్పారు. నరసాపురం డిపో నుంచి 5 బస్సులు, మచిలీపట్టణం డిపో నుంచి 5 బస్సులు తిప్పుతున్నామన్నారు. ఈ వేసవిలో రద్దీని బట్టి స్పెషల్ బస్సులు తిప్పడానికి ప్రణాళిక తయారు చేస్తున్నామన్నారు.

కేశవస్వామి సప్తాహ్నిక కల్యాణోత్సవాలు




కేశవస్వామి ఆలయంలో కల్యాణ అలంకరణలో శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామి

యలమంచిలి: స్థానిక కేశవస్వామి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామి వారి సప్తాహ్నిక కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వైశాక ఏకాదశి పుణ్య తిథిలో ఆదివారం తెల్లవారుజామున దేవేరుల కల్యాణం ఆలయ అర్చకులు వాడపల్లి గోపాలకృష్ణమాచార్యులు బ్రహ్మత్వంలో ఘనంగా నిర్వహించారు. ఏడు రోజులపాటు జరిగే ఈ వార్షిక కల్యాణోత్సవాల్లో దేవేరులకు నిత్య పూజలు, నిత్య హోమం, భక్తులకు ప్రసాద వితరణ, గజ వాహనంపై గ్రామోత్సవం ఉంటుందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు.

వాసవీ మాత జయంతి

పాలకోడేరు: వాసవీ మాత జయంతి ఉత్సవాలను స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ మాత విగ్రహానికి పూలమాలల వేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చలంచర్ల సుబ్రహ్మణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రఘు, ఎ.రంగా, సోము వెంకట రావు, గ్రామ సంఘ అధ్యక్షుడు గ్రంధి రాజా, సెక్రటరీ సోము రామకృష్ణ, ఉపాధ్యక్షుడు పూర్ణా రావు, యానాది శెట్టి పాల్గొన్నారు.

వైభవంగా వాసవీమాత రథోత్సవం



రాయకుదురులో పూజలందుకున్న శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు

వీరవాసరం: శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవార్ల రథోత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. రాయకుదురు ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన చేపట్టారు. శ్రీ వాసవీ మాత ప్రత్యేక అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పూజా కార్యక్రమాల అనంతరం అమ్మవార్లను మేళ తాళాలతో, బాణాసంచా కాల్పుల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో నార్కేడమిల్లి సుబ్బయ్య గుప్తా, పచ్చిగోళ్ళ శ్రీనివాస గుప్తా, సింహాద్రి సాయి రాజేష్, పచ్చిగోళ్ళ పూర్ణచంద్రరావు, నార్కటపల్లి ఏడుకొండలు, పచ్చిగోళ్ళ చంద్రశేఖర రావు, పి.నగేష్, అన్నదాత రామకృష్ణ, పవన్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

అతిరాత్ర మహాయాగానికి దాతల విరాళం

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం డీఎన్నార్ కళాశాల క్రీడా మైదానంలో జరుగుతున్న అతిరాత్ర మహాయాగానికి దాతలు సహకారం అభినందనీయమని పర్యవేక్షకులు చెరుకువాడ రంగసాయి తెలిపారు. అన్నదాన నిమిత్తం ప్రముఖ పారిశ్రామిక వేత్త కాకులపాటి రాధాకృష్ణ రూ.2.50 లక్షలు, చిలుకూరి వెంకట నరసింహరాజు రూ.లక్షా 25 వేలు, ఆనంద ఫౌండేషన్ ఒక రోజు యజ్ఞం, అన్నదానం ఖర్చును సంపూర్ణంగా అందించారని రంగసాయి తెలిపారు.

మారిన వాతావరణంతో రైతుల్లో అలజడి



కొప్పర్రులో ఆకాశం మేఘావృతమైన దృశ్యం



రుస్తుంబాదలోని మిల్లులో ధాన్యాన్ని ఒబ్బిడి చేస్తున్న కూలీలు



కె.బేతపూడిలో బరకాలు కప్పి ఉంచిన ధాన్యం రాశులు

నరసాపురం రూరల్: అకాల వర్షాలు, నైరుతి రుతిపవనాలు ముందుగా వస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతాంగంలో అలజడి నెలకొంది. పండించిన ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలో కొంతమంది. ధాన్యాన్ని విక్రయించేందుకు మరికొంత మంది రైతులు ఎవరిపనిలో వారు ఉన్నారు. అయితే శుక్ర, శనివారాల్లో పలుచోట్ల కురిసిన అకాల వర్షాలతో ధాన్యం కొంత మేర తడిసి పోవడంతో రైతాంగం దిగాలుగా ఉన్నారు. రాశులపై ఉన్న ధాన్యం తడవకుండా ఉండేందుకు బరకాలు కప్పి ఉంచారు. ఆదివారం ఉదయం నుంచి ఉక్కబోత, ఎండ ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. అయితే మధ్యాహ్నం నుంచి ఒక్క సారిగా వాతావరణంలో పలు మార్పులు చోటు చేసుకుని మబ్బులు కమ్మేయడంతో చల్లని గాలులు వీయడంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఈ నేపథ్యంలో నరసాపురం పట్టణం, మండలంలోని పలు ప్రాంతాల్లో చిరుజల్లులు పడటంతో రైతులు ఉరుకులు పరుగులతో ధాన్యం ఒబ్బిడి చేసి మిల్లర్లకు తరలించే పనులు ముమ్మరం చేశారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి



బర్రి శ్రీవెంకటరమణ

నరసాపురం: అన్ని శాఖల అధికారులు తమతమ విధులు సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ సూచించారు. ఎన్నికలు పూర్తయిన సందర్భంలో ఉద్యోగులు సాధారణ విధులపై దృష్టి పెట్టాలలని చెప్పారు. పారిశుధ్యం, వీధిలైట్లు సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. వేసవి దృష్ట్యా పట్టణంలో ఎక్కడా మంచినీటి ఇబ్బందులు ఏర్పడకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

వాలమర్రులో వైభవంగా వెంకన్న కల్యాణం



వాలమర్రులో వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని వాలమర్రులో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత నడింపల్లి సత్యనారాయణరాజు-లీల దంపతులతో అర్చకస్వామి పెద్దింటి మణికిరణ్ బ్రహ్మత్వంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవార్లకు ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. వాలమర్రు, కాపవరం, కొమ్ముచిక్కాల తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

స్పీడ్ బ్రేకర్లు వేయాలి

నరసాపురం: పట్టణంలోని స్టీమర్ రోడ్డు జంక్షన్ వైఎస్సార్ సెంటర్ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు వేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు లేకపోవడంతో ప్రతీ రోజూ ఏదో ప్రమాదాలు జరుగుతున్నాయి. అల్లూరి సత్యనారాయణరాజు మునిసిపల్ కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న ఈ ప్రాంతం పట్టణంలో ప్రధాన సెంటర్‌గా ఉంటుంది. పట్టణంలో మొత్తం వ్యాపారమంతా దాదాపు ఇదే ప్రాంతంలో జరుగుతుంది. కూరగాయల మార్కెట్, చేపలు, కిరాణా మార్కెట్‌కు ఈ ప్రాంతం గుండానే వెళ్లాలి. ముఖ్యంగా పలు కళాశాలల విద్యార్థులు నిత్యం ఈ మార్గం గుండానే ప్రయాణిస్తారు. ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలో రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. అయితే రద్దీగా ఉండే ఈ ప్రాంతం గుండా వాహనాలు మితిమీరిన వేగంతో వెళుతుండడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు నిర్మించే పరిస్థితి కాస్త మెరుగవుతుందని పట్టణ వాసులు కోరుతున్నారు.

ముత్యాలపల్లిలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు



ముత్యాలపల్లి పంచాయతీ గెదెళ్లవంపులో తనిఖీలు చేస్తున్న పోలీసులు



చెరుకువాడలో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ రజనీకుమార్, ఎస్సై సుభానీ

మొగల్తూరు: ఎన్నికల ఓట్లు లెక్కింపునకు మరికొద్ది రోజుల సమయం మాత్రమే ఉండటంతో కౌంటింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు ముందుస్తు జాగ్రత్తలు చేపట్టారు. పోలింగ్ రోజున రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో హింసాత్మక సంఘనలను దృష్టిలో ఉంచుకుని కౌంటింగ్ రోజున ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగుకుండా జిల్లా ఎస్పీ అజిత ఆదేశాల మేరకు డీఎస్పీ జి.శ్రీనివాస రాజు ఆధ్వర్యంలో సుమారు 30 మంది పోలీస్ సిబ్బందితో తనిఖీలు చేపట్టినటు మొగల్తూరు ఎస్సై కె.వెంకటరమణ తెలిపారు. ఆదివారం మొగల్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ముత్యాలపల్లి, అదే పంచాయతీలోని గెదెళ్ల వంపు ప్రాంతాలలో కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా ఉన్నారా? లేదా లెక్కకు మించి నగదు ఉందా? లేదా సారా, మద్యం ఏమైనా నిల్వ చేశారా? వంటి విషయాలపై ఆకస్మిక తనిఖీ చేసినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల లెక్కింపు రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు పాల్పడవద్దని హెచ్చరించామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ కె.గోవిందరాజు, నరసాపురం రూరల్ ఎస్సై గుర్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

25 మోటారు సైకిళ్ల స్వాధీనం

పెనుగొండ: పెనుగొండలో నిర్వహించిన కార్డన్ అండ్ సెర్చ్‌లో 25 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకొన్నట్లు పెనుగొండ ఎస్సై ఎస్‌కే సుభానీ తెలిపారు. ఆదివారం ఉదయం ఐదు గంటల నుంచి నర్సాపురం డీఎస్పీ ఆదేశాల మేరకు సీఐ నక్కా రజనీకుమార్ ఆధ్వర్యంలో ఆచంట ఎస్సై డి.రాజ్ కుమార్‌తో కలిసి సర్కిల్ పరిధిలోని సిబ్బందితో పెనుగొండ చెరుకువాడలో ఆకస్మిక తనికీ నిర్వహించినట్లు వివరించారు. తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 25 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కి తరలించినట్లు తెలిపారు.

విద్యార్థిని కంటి పరీక్షకు సహాయం



వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినికి ఆర్థిక సహాయం చేస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థిని కంటి వైద్యం నిమిత్తం పట్టణ వాకర్స్ క్లబ్ సభ్యులు ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం స్థానిక కుళాయి చెరువు గట్టు వద్ద వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు విద్యార్థిని చవ్వాని మేరికి రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. సుధాకరరావు మాట్లాడుతూ స్థానిక బీఆర్ఎంవీ పురపాలక ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని మేరి కంటి సమస్యతో బాధపడుతున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారన్నారు. చదువుకునేటప్పుడు ఇబ్బందులు పడుతుందన్నారు. కంటి చికిత్స చేయించుకోవడానికి ఆర్థిక సమస్యలు తలెత్తడంతో క్లబ్ నుండి ఆర్థిక సహాయం అందించామన్నారు. క్లబ్ సెక్రటరీ షేక్ పీర్‌సాహెబ్, ట్రెజరర్ పోతుల ఉమాశంకరరావు, ఉపాధ్యక్షులు మానెం బసవరాజు, సలాది రామచంద్రరావు, బొలిశెట్టి నాగరాజు, మేకా త్రిశూలపాణి తదితరులు పాల్గొన్నారు.

కళాకారుడు సత్యనారాయణకు సత్కారం



దగ్గులూరులో కళాకారుడు సత్యనారాయణను సత్కరిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: రంగస్థలమే ఊపిరిగా భావించి ఎన్నో ప్రదర్శనలు ఇచ్చి ప్రేక్షకులను మెప్పించిన సత్యనారాయణ తన జీవిత కాలంలో మరిన్ని సేవా పురస్కారాలు అందుకోవాలని గ్రామ ఉపసర్పంచ్ విశ్వనాథం పేరయ్య, ఎంపీటీసీ సభ్యుడు శాగ సత్యనారాయణ కోరారు. నరసాపురానికి చెందిన రిటైర్డు బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి కడలి సత్యనారాయణ ఇటీవల ఊటీలో భారత కళారత్న, గౌరవ డాక్టరేట్‌తో పాటు విజయవాడలో దాసరి కళారత్న అవార్డులు స్వీకరించిన సందర్భంగా దగ్గులూరు కళాకారుల ఆధ్వర్యంలో దగ్గులూరు చేనేత సొసైటీ భవనంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ప్రముఖ కవి, రచయిత లింగం సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వీరవాసరం కళాపరిషత్ అధ్యక్షుడు గుండా రామకృష్ణ, గ్రామ మాజీ సర్పంచ్ సప్పరపు కోటేశ్వరరావు, అందే కోటి వీరభద్ర రావు, మానాపురం సత్యనారాయణ, వేగేశ్న సత్యనారాయణరాజు, దాడి సాంబమూర్తి, శలా విశ్వనాథం, చల్లా మల్లికార్జునరావు, చల్లా మల్లేశ్వరరావు తదితరులు సత్యనారాయణ కళా సేవను ప్రశంసించారు. దగ్గులూరు కళాకారులు చల్లా శ్రీను, తాళ్ల కోటి నరసింహ మార్లింగం శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందించారు.


క్రికెట్ పోటీల్లో విజేతగా తాళ్లపాలెం జట్టు



దేవ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన దేవ తాళ్లపాలెం జట్టు

పెనుగొండ: మండలంలోని దేవలో నిర్వహిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అండర్17 క్రికెట్ టోర్నమెంట్‌లో దేవ తాళ్లపాలెం జట్టు విజేతగా నిలిచింది. పదిరోజులుగా జరుగుతున్న టోర్నమెంట్‌లో ఆదివారం జరిగిన ఫైనల్‌లో తాళ్లపాలెం జట్టు గెలుపొందడంతో మొదటి బహుమతిని ఉప సర్పంచ్ సాక సుబ్రహ్మణ్యం కప్‌తో పాటు, రూ.3వేలు, రెండవ స్థానంలో నిలిచిన దేవ జట్టుకు సబ్బితి జీవన్ రాజు కప్‌ను, నగదు రూ.1500ను అందించారు. కార్యక్రమంలో పెనుగొండ వైస్ ఎంపీపీ పాలపర్తి సుబ్రహ్మణ్యం, నేలపూడి చినబాబు, దొడ్డి చంటి, పాలపర్తి సుమంత్, గూనపాటి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న స్టేట్ కేవీబీవీ డైరెక్టర్ బీ మధుసూదన్‌రావు

తణుకు టౌన్: ఆర్థికంగా పేద విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ఎస్సీ, ఎస్టీ, ఉద్యోగులు సహకరించాలని స్టేట్ కేవీబీవీ డైరెక్టర్ బీ మధుసూదనరావు కోరారు. ఆదివారం సాయంత్రం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసమావేశానికి జిల్లా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ గంజి మధుసూదన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కేవీబీవీ డైరెక్టర్ బీ మధుసూదన్ రావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల్లో అత్యంత ప్రతిభ కలిగిన నిరుపేద విద్యార్థులను ఉన్నత చదువులు చదివించాలని, అందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. జిల్లా ఏడీసీ పి.శ్యామ్‌సుందర్, మాజీ సీఎంఒ టీటీఎఫ్ రూజ్‌వెల్ట్, ఏలూరు జిల్లా ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ చైర్మన్ ఎ.సర్వేశ్వరరావు, తాళ్లపూడ ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు, మురాల సుదాకర్, ఏవీఎస్ రాజన్న, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి లక్ష్మీనారాయణుడి బ్రహ్మోత్సవాలు



అష్టభుజ లక్ష్మీనారాయణస్వామి

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని శ్రీ చతుర్భుజ లక్ష్మీతాయార్ల సమేత శ్రీ అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామివారి (చినగోపురం) బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలు తొమ్మిది రోజులు పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.టి గోవిందరావు తెలిపారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు విశాఖ జిల్లా పెందుర్తి వాస్తవ్యులు, కళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రధానార్చకులు ముప్పిరాల అనంతాచార్యస్వామి మరియు వారి శిష్య బృందం ద్వారా వైదిక కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. బుధవారం ఉదయం అలంకార తిరుమంజనం, రాత్రి ఊంజల్ సేవ, చంద్ర వాహనసేవ, తిరువీధి ఉత్సవం, గురువారం రాత్రి శేషవాహనసేవ, శుక్రవారం రాత్రి హనుమంత వాహనసేవ, శనివారం రాత్రి గరుడ వాహనసేవ, అనంతరం పటికబెల్లంతో శ్రీ కృష్ణ తులాభారం, ఆదివారం ఉదయం శ్రీ వారికి పూలంగి సేవ, రాత్రి ఎదురు సన్నాహ మహోత్సవము, అనంతరం శ్రీవారి తిరుక్కల్యాణం, సోమవారం ఉదయం శ్రీవారికి చందనోత్సవం, రాత్రి రథోత్సవం, మంగళవారం ఉదయం వసంతోత్సవం అనంతరం ధ్రువమూర్తుల తిరుమంజనం, మధ్యాహ్నం మహా పూర్ణాహుతి, రాత్రి ప్రణయ కలహము (ఏడు ముసుగుల ఉత్సవము), దివ్య మంగళ దర్శనం, బుధవారం ఉదయం సుదర్శన మహాయజ్ఞం, మధ్యాహ్నం తిరుప్పావడై ఉత్సవం , రాత్రి పండిత సత్కారం అనంతరం శ్రీ పుష్ప యాగం నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలు తొమ్మిది రోజులు ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, సహస్రనామ పూజలు జరుగుతాయన్నారు.

సుందరయ్యకు ఘన నివాళి



ఆచంటలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పెనుగొండ: భారత కమ్యూనిస్టు ఉద్యమంలో ధృవతారగా నిలిచిన స్వతంత్ర సమరయోధుడు, మహానేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కెతా గోపాలన్‌అన్నారు.ఆదివారం సాయంత్రం స్థానిక సీపీఎం కార్యాలయం వద్ద పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి సీపీఎం సీనియర్ నాయకులు తోటపల్లి సత్యనారాయణ, తలుపూరి బుల్లబ్బాయి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఇందుకూరి సూర్యనారాయణ రాజు, సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎస్ వి ఎస్ శర్మ, సిర్రా నరసింహమూర్తి, కుసుమే జయరాజు, గుత్తుల రంగారావు, పీమోహనరావు, బొర్రా ధర్మారావు తదితరులు పాల్గొన్నారు. పెనుగొండ మండలంలో సిద్ధాంతంలో ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో పుచ్చల పల్లి సుందరయ్య వర్ధంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షురాలు పద్మావతి, సీపీఎం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కప్పల రత్నరాజు, కడలి త్రినాథ్, కె.వెంకట్రావు, మునియ్య, చలపతి, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ, విశ్వాసమే మనల్ని గెలిపిస్తాయి



ఫంక్షన్ హాలును ప్రారంభించిన నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి

ఆకివీడు: ప్రేమ, విశ్వాసమే మనల్ని జీవితంలో గెలిపిస్తాయని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి చెప్పారు. స్థానిక ధర్మాపుర అగ్రహారంలోని చర్చి ఆవరణలో నూతనంగా నిర్మించిన ఫంక్షన్ హాలును ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం గ్రామంలోని సుమారు 250 మంది ఆడపడుచులకు ఆమె చీర, జాకెట్ ముక్కలను పంపిణీ చేశారు. కౌన్సిలర్ కటికతల జాన్ వెస్లీ మాట్లాడుతూ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి సహకరించిన ఐఆర్ఎస్ ఇన్‌కంట్యాక్స్ కమిషనర్ మరపట్ల విజయ్ కుమార్, రిటైర్డ్ ఉపాధ్యాయులు భమిడిపాటి సూర్య భాస్కరరావు, కేవీఎల్ నర్సింహరావు, ఎండీ.మస్తాన్, జేఎస్సార్, కటికతల మోషే, జామి శ్రీనివాస్, రామకూరి సంపతరావు కుటుంబం, లాజర్ తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని లాకు సెంటర్ వద్ద ఈ నెల 2వ తేదిన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం నరసాపురం మండలం సార్వ గ్రామానికి చెందిన మేడిది వెంకట సత్యనారాయణ (42) పాలకొల్లు పట్టణంలో ఫైనాన్స్ వ్యాపారం చేస్తుంటారు. మే నెల 2న ఉదయం 6 గంటల సమయంలో ఇంటి వద్ద బయలుదేరి పాలకొల్లు లాకు సెంటర్ వద్దకు చేరుకున్నారు. ఇంతలో ఓ ద్విచక్ర వాహనదారుడు ఫోన్ మాట్లాడుతూ లాకు సెంటర్ వద్ద తన వాహనాన్ని అకస్మాత్తుగా మలుపు తిప్పడంతో సత్యనారాయణ వాహనాన్ని ఢీకొట్టాడు. దానితో సత్యనారాయణ కింద పడిపోవడంతో తలకు తీవ్రమైన గాయమైంది. ప్రమాదానికి గురైన సత్యనారాయణను రాజమండ్రిలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని తల్లి నాగమణి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం జువ్వలపాలెం రోడ్డులో వేంచేసి ఉన్న శ్రీ పద్మావతి వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆదివారం బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా తొలుత శ్రీవేంకటేశ్వరస్వామి వారికి, పద్మావతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక చందన అలంకరణ చేశారు. ఆ తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తె అలంకరణలో చేశారు. దేవస్థానం చైర్మన్ మంతెన రామ్ కుమార్ రాజు దంపతులు, గాదిరాజు సాయికుమార్ రాజు దంపతులచే ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

చెన్నరంగనిపాలెంలో...

పట్టణంలోని చెన్నరంగనిపాలెంలో వేంచేసి ఉన్న అలివేలు మంగ శ్రీపద్మావతి వేంకటేశ్వర స్వామి 33వ వార్షిక కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కుక్కల కోటేశ్వరరావు భవ్య దంపతులతో దేవస్థానం నిర్వాహకులు వెంకట సుబ్బారావు ప్రత్యేక పూజలు జరిపించారు.